


# వడ్డీ


టి.యస్.ఎ.కృష్ణమూర్తి

స్టెప్స్ మధ్యనున్న పిట్ మీదుగా నడిపించుకు వెళ్ళి ఏకంగా వరండాలో ఆపాను మోటారుసైకిలు ఆ సమయంలో మామూలుగా నా కోసం ఎదురు చూస్తూ వరండాలో నిలబడే పిల్లలు అక్కడ లేరు స్టాండువేసి మోటార్‌బైక్ నిలబెట్టి, పెట్రోలు ఆపుచేసి, కీస్ ఊడదీసుకుని హాల్లోకి నడిచాను

చిరునవ్వుతో ఎదురొచ్చే నాశ్రీమతి కూడా హాల్లోకి రాకపోగా వికారంగా కన్పించే పనిమనిషి పాపమ్మ కంగారుగా పరిగెత్తుకు వచ్చేసరికి కాస్త తెల్లబోయాను



అమ్మగారు సాయంకాలము మూడు గంటల రైలు బండికి పిల్లల్నిద్దర్నీ తీసుకుని మీ అత్తగారి



ఊరెళ్ళారు బాబూ! మీరు రాగానే ఈ కాగితం ఇమ్మన్నారు' అంటూ ఓ కాగితం అందించింది పాపమ్మ

ఏం కొంపలు మునిగాయో, ఎవరి ప్రాణంమీదికి వచ్చిందో అని కంగారు పడిపోతూ గబగబా కాగితం మడతలు విప్పాను

శ్రీవారికి,

మీరు ఇంతకాలం నాకు వివరాలు తెలియనివ్వకుండా చేస్తున్న వ్యాపారం ఏమిటో నాకు పూర్తిగా, క్లియర్‌గా తెలిసిపోయింది ఈ రోజు నాకు మీమీద చాల కోపం వచ్చింది ఎంత సరిపెట్టుకుందామని ప్రయత్నించినా నా మనసు అంగీకరించడం లేదు అందుకే మొట్టమొదటి పర్యాయం మీమీద అలిగి మీతో చెప్పకుండా, మీ అనుమతి తీసుకోకుండా పల్లెకు వెళ్తున్నాను పిల్లల్ని కూడా తీసుకుని వారం రోజుల తరువాతకానీ తిరిగిరాను

డబ్బు, బంగారం, హోదా ఇలాంటి వేవీ లేకపోయినా మీ నీడన నవ్వుతూ బ్రతికెయ్యగల ఆత్మస్థయిర్యం నాకుంది ఆ విషయం మీకూ బాగా తెలుసు కానీ, నా ఆలోచనా విధానాలన్నీ తెలిసీ మీరు నన్ను ఒకరంగా మోసం చేశారు ఇంతకన్నా బాధాకరం మరొకటి ఉంటుందా?

మీరు చేస్తున్న ఆ పాపిష్టి వ్యాపారంతో వచ్చిపడుతున్న ఈ సౌఖ్యాలను నేను ఏమాత్రం ఇష్టపడను ఇకపై మన సంసారనావ సజావుగా, ఆనందంగా నడపడం కోసం మీరు ఆ వ్యాపారాన్ని పూర్తిగా ఆపవెయ్యాలి నేను తిరిగి వచ్చేలోగా

ఈ ఒక్క విషయంలో మాత్రం మీ ఇష్టా, యిష్టాలను నేను గుర్తింప దలచుకోలేదు అందుకు నన్ను మన్నించండి. ఇంతకన్నా ఎక్కువ వ్రాయవలసిన అవసరం లేదు కదూ"

వెళ్ళి వస్తాము

మీ


సుగాత్రి

నా గుండె ఝల్లుమంది ఏదయితే జరగకూడదో అదే జరిగింది నా శ్రీమతికి తెలియనివ్వకుండా అతి రహస్యంగా నేను సాగిస్తూ వచ్చిన వ్యవహారం అంతా తనకి తెలిసిపోయింది

దేవతలాంటి సుగాత్రి, నన్ను వదిలి ఒక్క రోజయినా గడపలేని నా శ్రీమతి వారం రోజులపాటు



నన్ను వెలేసి నాకు దూరంగా ఉండాలని వెళ్ళిపోయిందంటే తనకి వచ్చిన కోపం సామాన్యమైనది కాదు ఖచ్చితంగా వారం రోజులపాటు సుగాత్రికి దూరంగా నేను నిస్సారంగా జీవించడమా? నెవర్!



"పాపమ్మా!"

నేను అరచిన అరుపుకు పాపమ్మ మళ్ళీ పరిగెత్తుకు వచ్చింది కంగారుగా వంట గదిలోంచీ.

"నేనూ ఇప్పుడే మా అత్తగారి ఊరు వెళ్తున్నాను. మేము తిరిగి వచ్చేదాకా రాత్రులందు మీ అబ్బాయిలిద్దర్నీ ఇంట్లో పడుకోమని చెప్పు. ఇల్లు జాగ్రత్త!" అనేసి లోపలి గదిలోకి పరుగుతీశాను.

ఐదు నిముషాలలో వి ఐ పి బ్రీఫ్ కేసులో బట్టలు సర్దుకుని హాల్లోకి వచ్చాను చోద్యం చూస్తున్న దానిలా ఇంకా అక్కడే నిలబడివుంది పాపమ్మ.

"నేను స్టేషనువద్ద దిగిపోయి ఆంజనేయులు చేత మోటారుసైకిలు ఇంటికి పంపిస్తాను!" అంటూ బయల్దేరాను

ఆఫీసునుండీ వసూళ్ళకు వెళ్ళిన ఆంజనేయులు అదృష్టవశాత్తు నాకు సులభంగానే తటస్థపడ్డాడు అతన్ని నాతోపాటు తీసుకువెళ్ళి రైల్వేస్టేషనువద్ద అతనికి మోటారుసైకిలూ, ఆఫీసుకు శెలవుచీటీ అప్పజెప్పి బయల్దేరబోతున్న పాసింజరు ట్రెయిన్ అందుకున్నాను మా అత్తగారి ఊరి తాలూకు స్టేషన్‌లో మెయిల్‌గానీ, ఎక్స్‌ప్రెస్‌గానీ ఆగవు.

రైలు పురోగమించడం ప్రారంభించగానే నా ఆలోచనలు గతంలోకి తిరోగమించడం మొదలు పెట్టాయి

★ ★ ★ ★

బామ్మకి క్యాన్సరు జబ్బు వచ్చేదాకా నాకు ఆర్థికపరమైన ఇబ్బందులంటే ఏమిటో సరిగ్గా అవగాహన కాలేదు.

రికవరీలుపోగా పదకొండు వందలు జీతం చేతికి అందేది. అందులో వందరూపాయలు నా స్వంత ఖర్చులకు ఉంచుకునే వాడ్ని. రెండువందలు బెనారస్ యూనివర్సిటీలో చదువుతున్న చిన్న తమ్ముడికి నా వాటాగా పంపివేసే వాడిని. వంద రూపాయలు పిల్లల కాన్వెంటు ఫీజులు కట్టేవాడ్ని. వంద రూపాయలు ఫోస్టాఫీసులో కట్టేసేవాడ్ని మిగిలిన ఆరువందల రూపాయలు సుగాత్రి చేతిలో పడవేసే వాడ్ని.

మా పల్లెనుండీ తిండిగింజలు వచ్చిపడేవి కాబట్టి ఆ ఆరువందలతోనే ఏలోటూ లేకుండా సంసారాన్ని నెట్టుకు వచ్చేది సుగాత్రి అందులోంచే మిగిల్చి పిల్లల పుస్తకాలూ, చిన్న చిన్న వస్తువులూ, దీపావళి టపాకాయలూ లాంటివన్నీ తనే కొంటుండేది. ప్రతి సంవత్సరం ఫెస్టివల్ అడ్వాన్సు, ప్రావిడెంట్‌ఫండులోన్ డ్రా చేసి అందరికీ బట్టలు ఒకేసారి కొనేసేవాడ్ని మళ్ళీ సంవత్సరంలోపు ఆ బాకీలు తీరిపొయ్యేవి.... మళ్ళీ...

ఒంటెద్దు బండి నడకలాగే అయినా హాయిగా, సుఖంగా సాగిపోతుండేది నా జీవితం. ఎలాంటి వ్యథలూ, మానసిక ఆవేదనలూ మా దరిదాపులకు వచ్చేవి కావు. రోజులు అలా, అలా సాగిపోతోండగా బామ్మ జబ్బు పడింది ఓ పర్యాయం.

* * * *

# వడ్డీ

మొదట ఆర్డినరీ ఎక్స్‌రే తీశారు. ఆ తరువాత రెండ్రోజులు ఆగి ఏదో లిక్విడ్ మింగించి మరో ఎక్స్‌రే తీశారు. ఆ తరువాత రోజు ఏదో ఎలక్ట్రిక్ బల్బులాంటి చిన్ని వస్తువును అతి సన్నని వైర్లతో సహా మింగించి స్క్రీనింగ్ చేశారు. మళ్ళీ ఎక్స్‌రే తీశారు.

మా ఊర్లో, మా తాలూకా కాదు మా జిల్లాలోనే చాల మంచి పేరున్న డాక్టరు వేదవ్యాస్.

"త్రోట్ క్యాన్సర్ బిగినింగ్ స్టేజిలోనే ఉందని ఖచ్చితంగా చెప్పగలను. మీరు ఏమాత్రం ఆలస్యం చెయ్యకుండా హైదరాబాదు తీసుకు వెళ్తే తప్పకుండా నయం అయిపోతుంది." అన్నాడు ఆయన స్వచ్ఛమైన ఇంగ్లీషులో బామ్మకి అర్థం కాకుండా.

నా గుండెలో రాయి పడింది.

"మీరు రేపు ఉదయం పది గంటలకు రండి. పేషెంటు హిస్టరీ షీటు, కవరింగ్ లెటర్ తయారు చేసి ఉంచుతాను. వాటిని తీసుకుని మీరు ఎప్పుడైనా బయల్దేరవచ్చు" అన్నాడు ఆయనే మళ్ళీ!

పాపం ఆయనకు ఎలా తెలుస్తుంది.... నేను పుట్టి పెరిగిన మా పల్లెటూరు, పై చదువు సాగించిన తిరుపతి, ఉద్యోగం చేస్తున్న ఈ ఊరు తప్ప మరో ఊరు చూసిన వాడ్ని కాననీ, బావిలో కప్పలాంటి వాడిననీ!?

"అలాగే డాక్టర్! ఉదయాన్నే వస్తాను!" అంటూ లేచి బామ్మను తీసుకుని బయల్దేరాను.

నా టెలిగ్రాములు అందుకుని అన్నయ్యా, పెద్ద తమ్ముడూ, రెండోవాడూ వరుసగా దిగిపొయ్యారు. ఆలోగా మా పల్లెనుండి అమ్మా, నాన్నగారూ కూడా బయల్దేరి వచ్చారు నేను పంపించిన ఉత్తరం అందుకుని.

"ఒరేయి క్యాన్సరు వచ్చినవాడూ, కాటికి వెళ్ళినవాడూ ఒక్కటేరా! అనవసరంగా అంత దూరం ఎందుకుగానీ ఇక్కడి మిషన్ హాస్పటల్‌లోనే చేర్పించేద్దాము. ఆయుస్సున్నన్నాళ్ళు ఉండనీ!" అనేశాడు అన్నయ్య.

ఇంకో వంద సంవత్సరాలు గడచిపోయిన తరువాత మనిషి ఆలోచనలు ఇంకెంత ఉన్నతంగా ఉంటాయో? అనుకున్నాను వాడి మాటలు విని.

"ఈ వయసులో బామ్మకి నయం అవుతుందనే నమ్మకం నాకూ లేదు.... హైదరాబాదంటే మాటలా?" అన్నాడు పెద్ద తమ్ముడు.

వేగం పుంజుకుంటున్న కాలంలో మనిషి ఎక్కడ్నుండి ఎక్కడికి ఎదిగిపోతున్నాడో? కమర్షియల్ థింకింగ్ అనేది ఎలా పుడుతుందో తెలియదు కానీ అది ఆత్మీయతల్ని సునాయాసంగా త్రోసి రాజంటుంది, అనిపిస్తుంది కు..కా మనుషుల చేత.

"నయం కాకపోవచ్చు అనే అనుమానం ఎందుకు? నయం అవుతుంది అనే ఆశతో హైదరాబాదు ..సుకు


ఆంధ్రపత్రిక
నమ్మదగిన వార్తలు, వ్యాఖ్యలే కాదు!
చదవదగిన విశేషాలు, శీర్షికలు
ఎన్నో వుంటాయి!!

వెళ్ళడం మన కర్తవ్యం నా వద్ద ప్రస్తుతం వెయ్యి రూపాయ లున్నాయి ప్రస్తుతానికి ఆ వెయ్యీ ఇస్తాను ఆపై కావాలంటే నెలకి రెండు వందల చొప్పున పంపగలను బామ్మకి పూర్తిగా నయం అయ్యేదాకా!'

అన్నాడు చిన్న తమ్ముడు సీరియస్‌గా వాడ్ని ప్రాక్టికల్ వెధవ అనుకునే వాళ్ళం అందరమూ వాడే ఎన్నోరెట్లు నయం నిజానికి అన్పించింది నాకు ఆ సమయంలో

రెండు నిముషాలు మా అందరి మధ్యా నిశ్శబ్దం రాజ్యమేలింది

మొదట నిశ్శబ్దాన్ని భంగపరచినవాడు నా పెద్ద తమ్ముడు

నేనూ వెయ్యి రూపాయలు ఇవ్వగలను కానీ నెలనెలా వంద రూపాయల కంటే ఎక్కువ పంపలేను చిన్నవాడికి కాశీకి నెలనెలా రెండు వందలు నేనూ పంపుతున్నానుగా' అన్నాడు

నేను ప్రస్తుతం ఏమి ఇవ్వలేనురా నెలనెలా రెండు వందల రూపాయలు మాత్రం పంపగలను అదీ కష్టంమీద' అన్నాడు అన్నయ్య

వాడిది పెద్ద సంసారం వాడికి ఫామిలీ ప్లానింగ్‌ను గూర్చి సరయిన అవగాహన లేకపోవడం వల్ల ఎల్లలు ఎక్కువ!

మా సంభాషణలతో తనకేం సంబంధం లేనట్టుగా వరండాలో కూర్చుని రామకోటి వ్రాసుకుంటోంది చావునీ, బ్రతుకునీ నిర్వికారంగా తీసుకోగలిగే వయసుకు ఎదిగి పోయిన బామ్మ!

నా కళ్ళలో నీళ్ళు తిరిగాయి చిన్న తనంలో నన్ను ఎవరైనా ఎల్లలు కొట్టి ఏడిపిస్తే కర్ర పట్టుకుని వాళ్ళని వెతుకుతూ బయల్దేరేది బామ్మ అమ్మ నను కేకలేస్తే తన బొడ్డులోంచి రాగి కాణీయో, ఇత్తడి అర్ధణాయో తీసి ఇచ్చి నన్ను ఓదార్చేది తను ఏ ఊరు వెళ్ళినా నన్ను తన వెంట తీసుకు వెళ్ళేది రాత్రులందు నన్ను తన ప్రక్కలో పడుకోబెట్టుకుని వెచ్చగా రగ్గు కప్పి రకరకాల కథలను చెప్పేది


బామ్మకి జబ్బు నయం చేయించకుండా ఎలా ఉండగలను ప్రశాంతిగా? అనుకున్నాను

* * * *

పోస్టాఫీసులో నా పేరిట నెలకు వంద చొప్పున కడ్తూ ఉండిన మొత్తం ఆరువేల రూపాయల వరకూ ఉన్నది డ్రా చేశాను తమ్ముళ్ళు ఇచ్చిన రెండు వేల రూపాయలూ నాన్నగారు పల్లెలో గింజలు అమ్మి తెచ్చిన రెండు వేలూ మొత్తం పదివేల రూపాయలు తీసుకుని, బామ్మనూ, అమ్మనూ, నాన్ననూ, అన్నయ్యనూ తీసుకుని హైదరాబాదు బయల్దేరాను

అదృష్టవశాత్తు హైదరాబాదులో హాస్పటల్‌కి దగ్గరగానే సౌకర్యాలున్న ఓ గది దొరికింది నెలకు నాలుగు వందల రూపాయల అద్దెకి నిజానికి అంతలో ఆ ప్రాంతంలో సౌకర్యాలున్న గదులు దొరకడం చాల కష్టమట

బామ్మని హాస్పటల్‌లో చేర్పించిన తరువాత రెండ్రోజులు అక్కడే ఉండి తరువాత అమ్మనూ,




నాన్ననూ బామ్మకి తోడు ఉంచి వాళ్ళకి కావల్సినవన్నీ కొని గదిలో ఉంచి నేనూ అన్నయ్యా ఎవరి ఊర్లకు వాళ్ళు వచ్చేశాము

* * * *

బామ్మని తీసుకెళ్ళడాన్కి క్యాన్సర్ రూపం ధరించి వచ్చిన మృత్యు దేవతతో సమరం మొదలు పెట్టారు హాస్పటల్ వాళ్ళు

* * * *

రోజులు, వారాలు, నెలలు గడుస్తున్నాయి వారానికి లేదా పది రోజులకు ఒకసారి ఎవరో ఒకరం వెళ్ళి బామ్మనీ అమ్మా నాన్నలనూ చూసి పరిస్థితి తెలుసుకుని వస్తున్నాము

డబ్బు మంచినీళ్ళలా ఖర్చయి పోతుండడం వల్ల పదివేల రూపాయలు త్వరలోనే పూర్తయి పోయాయి నాకు తెలియకుండా తను దాచుకుని ఉండి అవసరాన్ని గ్రహించి సుగాత్రి నాకు అందించిన పన్రెండు వందల రూపాయలు కూడా అయిపోయాయి

అన్నయ్యా, తమ్ముళ్ళూ నెలనెలా పంపుతున్న ఐదువందలూ, పరిస్థితిని అర్థం చేసుకుని తన ఖర్చులు పూర్తిగా తగ్గించుకుని చిన్నతమ్ముడు బెనారస్ నుండి నెల నెలా వాపసు పంపుతున్న వందా, నా జీతంలో మిగిలిస్తున్న డబ్బూ అన్నీ కలసినా చాలడం లేదు

చివరికి విధిలేని పరిస్థితులలో నా జీవితంలో మొట్ట మొదటి పర్యాయం అప్పుకోసం ప్రయత్నం చేశాను మా ఆఫీసులోనే అటెండరు మల్లయ్య వద్దే అప్పు లభిస్తుందని తెలిసి తెల్లబోయాను

లూజు బట్టలలో దీనంగా కన్పించే మల్లయ్య, సోడాబుడ్డీ కళ్ళద్దాలలోంచి భావశూన్యంగా చూసే మల్లయ్య, నాలాంటివాళ్ళు జాలిపడి అప్పుడప్పుడు క్యాంటీన్‌లో టిఫిన్‌లు ఇప్పిస్తే ఆప్యాయంగా తినే మల్లయ్య, కష్టాల బరువుతో నడుం వంగిపోయిన వాడిలా, విషాదం తప్ప ఆనందం అనేది ఎరుగని వాడిలా కన్పించే మల్లయ్య ఒక్క మాటలో చెప్పాలంటే మూడ్ దొరకని ఆర్టిస్టు గీసిన అసంకల్పిత చిత్రంలా కన్పించే మల్లయ్య అప్పులు ఇస్తాడా?

నా ఆశ్చర్యం చూసి విసుక్కున్నారు నాకు ఇన్‌ఫర్‌మేషన్ ఇచ్చిన తోటి ఉద్యోగులు అతనివద్ద కూడా ఆశ్చర్యం కనబరచు వడ్డీ రెట్టింపుగా లాగుతాడు అని బయపెట్టారు కూడా

ఆశ్చర్యంలోంచి తేరుకున్న తరువాత మల్లయ్యను పిలిచి విడిగా మాట్లాడాను

మికాసార్! ఎంతయినా తీసుకోండి ఇస్తాను నూటికి నెలకు పది రూపాయలు వడ్డీ! అన్నాడు

బాప్‌రే! టెన్‌పర్సెంటా?

మీరు మంచివారూ, ఎప్పుడూ అప్పులు చెయ్యని వారూ నమ్మకస్తులూ, ముఖ్యంగా మీ అవ్వగారి జబ్బు నిమిత్తం అప్పు చేస్తున్న వారూ కాబట్టే వడ్డీ తగ్గించి చెప్పాను ఇతరు లెవరికీ నేను ఇంతవరకూ నూటికి నెలకు పన్రెండు రూపాయలకు తక్కువ ఇచ్చింది లేదు నిజంసార్! అన్నాడు మల్లయ్య

వడ్డీ చాల ఎక్కువ!' అనుకున్నాను మనసులో

పోనీ ఒకపని చెయ్యండి బంగారం ఏదయినా తీసుకురండి నూటికి ఆరు రూపాయల వడ్డీతోటే డబ్బిస్తాను బంగారం మీదనయితే! అన్నాడతను నా మనసులో భావం గ్రహించిన వాడిలా

నేను చకచకా ఆలోచించాను

సుగాత్రి శరీరం మీదున్న నగలన్నీ వాళ్ళ పుట్టింటివాళ్ళు పెట్టినవే! నేను చేయించినవి ఏమీలేవు కాబట్టి వాటిలో ఏ ఒక్కటీ కూడా తాకట్టు పెట్టడం బావుండదు. నాన్న ఊపిరి ఉండగా అమ్మ తన మెడలోని కాసుల పేరు ఊడదీయదు వదినా మరదల్లూ అంత ఉదారంగా తమ నగలు తాకట్టు పెట్టడానికి తీసి ఇవ్వరు ఖచ్చితంగా!

ఆలోచనలు మాని తలవిదిలించాను

పదిహేనువందల రూపాయలు అప్పు తీసుకున్నట్టు మల్లయ్య భార్యపేరిట కాగితం వ్రాసి ఇచ్చి వెయ్యి రూపాయలు తీసుకున్నాను అతని వద్ద అయితే ఈ విషయం నేను సుగాత్రికి చెప్పలేదు చెప్పి తనకి కూడా ఎందుకు అశాంతిని

కలిగించడం అనుకున్నాను

ఆ రోజునుండీ హోటళ్ళలో కాఫీ, టీలు త్రాగడం, సిగరెట్లు త్రాగడం చివరికి సినీమాలు చూడడం కూడా పూర్తిగా మానుకున్నాను నాకు ఉద్యోగం వచ్చిన నాటినుండీ తెప్పిస్తున్న డైలీ పేపరు హిందూను కూడా నిలిపి వేశాను

కర్తవ్య దీక్షలో కొన్ని సుఖాలు త్యజించక తప్పదు మరి

టెన్‌పర్సెంట్ వడ్డీతో తీసుకున్న వెయ్యి రూపాయలు కూడా అట్టే రోజులు కాకమునుపే పూర్తయిపోయాయి

నాన్నగారి దగ్గర్నుండి ఉత్తరం వచ్చి పడింది మళ్ళీ! నాలో పట్టుదల పెరిగింది!!

★ ★ ★ ★

మళ్ళీ మల్లయ్య వద్ద ఇంకో వెయ్యి రూపాయలు తీసుకోవాలని నిశ్చయించుకున్నాను అయితే ఈ పర్యాయం మాత్రం సుగాత్రికి విషయం అంతా వివరించాను

పది రూపాయల వడ్డీతో వెయ్యి రూపాయలు తీసుకున్నారా? ఇంకో వెయ్యి తీసుకోబోతున్నారా? అంటూ నిర్ఘాంత పోయింది సుగాత్రి సుగాత్రికి వడ్డీ వ్యాపారులంటే అసహ్యం వడ్డీకి అప్పులు తెచ్చుకునే వాళ్ళన్నా గిట్టదు తనకి

అవును వడ్డీ ఎక్కువే, తక్కువ వడ్డీకి అంటే నూటికి ఆరు రూపాయల వడ్డీతోట కూడా అప్పివ్వ గలడు ఆయన అయితే బంగారం ఏదయినా తాకట్టు పెట్టాలి! అన్నాను

ఏడిచాడు మన ఎదురింటి యశోదమ్మ పిన్ని గారు బంగారంమీద నూటికి మూడు రూపాయల వడ్డీతోటే అప్పులు ఇస్తారు ఈవాళ శుక్రవారం రేపు వెళ్ళి యశోదమ్మ పిన్నిగారివద్ద నా నెక్లెస్ తాకట్టు పెట్టి రెండు వేల రూపాయలు తీసుకు వస్తాను వెయ్యి రూపాయలు మామగారికి పంపించండి ఇంకో 'వెయ్యి' తీసుకువెళ్ళి ఆ మల్లయ్య ఎవరో అతనికి ఇచ్చేయండి ఇంకెప్పుడూ నాకు తెలియకుండా అడ్డమైన గడ్డి వడ్డీ రూపంలో తినే నరరూప రాక్షసుల వద్ద అప్పులు చేయకండి నాకు కంపరం, భయం బాబూ వడ్డీ తినేవాళ్ళ

# వడ్డీ

'చేతులలో పడ్తే పచ్చని సంసారాలు ఒక్కసారిగా ఎరెడి భగ్గుమని కాలిపోతాయి! అంది సుగాత్రి

ఈసారి నిర్ఘాంతపోవడం నా వంతయింది నిరుపారాయిలాగా వుండే ఎదురింటి యశోదమ్మ గారు బక్కరాలు, చెయెత్తి మొక్కాలనిపించే మనిషి వడ్డీ వ్యాపారం చేస్తారా? ఆమాటే అన్నాను సుగాత్రితో

ఆఁ! లక్షణంగా! అంది సుగాత్రి ఆ పాపపు బరువు దించుకోవడానికే ఆ పూజలూ, వ్రతాలూ అన్నీ! అంది మళ్ళీ తనే కాస్త కోపంగా

సుగాత్రికి వడ్డీ వ్యాపారం చేసే వాళ్ళంటే తగని భయం, అసహ్యం, కోపం కూడా!

★ ★ ★ ★

నేనిచ్చిన వెయ్యి తీసుకుని నా కాగితం నాకు తెచ్చి ఇవ్వగానే మల్లయ్యను క్యాంటీనుకు తీసుకు వెళ్ళి టిఫిన్ ఇప్పించాను

మల్లయ్యా! నీకెంతమంది పిల్లలు?

ముచ్చటగా ముగ్గురే బాబూ! అన్నాడు మల్లయ్య ఆనందంగా

సదా బావశూన్యంగా కన్పించే అతని చూపులలో ఓ మెరుపు కన్పించింది నాకు ఆ క్షణంలో

చదువు కుంటున్నారా?

అవును బాబూ! పెద్దబ్బాయి విశాఖపట్నంలో ఇంజనీరింగ్ చదువు తున్నాడు రెండో అమ్మాయి తిరుపతిలో డాక్టరు చదువుతోంది ఆఖరివాడు మదనపల్లిలో అదేదో హార్టికల్చరట బాబూ , అది చదువుతున్నాడు

మల్లయ్య కంఠ స్వరంలో మొట్టమొదటిసారి ఎంతో తృప్తి, కాస్త గర్వం విన్పించాయి నాకు ఓ వింత కాంతి కూడా స్పష్టంగా కన్పించింది అతని కళ్ళలో నాకాసమయంలో

ఆఫీసువాళ్ళిచ్చే యూనిఫాం తప్ప వేరే బట్టలు తొడుక్కోని మల్లయ్య ఎవరైనా 'ఎలిస్తే తప్ప క్యాంటీన్ మొహం చూడని మల్లయ్య, హవాయి చెప్పులు తప్ప మరొకటి వాడని మల్లయ్య ఈ మల్లయ్య తన ఎల్లల్ని ఒకరిని వైజాగ్‌లో ఇంజనీరింగ్, మరొకర్ని తిరుపతిలో మెడిసన్, ఇంకొకర్ని మదనపల్లిలో బి యస్ సి చదివిస్తున్నాడంటే సామాన్యమైన విషయం కాదు అతని కృషి వెనుక ఎంతో దీక్ష, పట్టుదల ఉండి వుండాలి

నీవేం చదివావు మల్లయ్యా?

టిఫన్ తినడం ముగించి ప్లేటులోనే చేయి కడుక్కుంటున్న మల్లయ్య విషాదంగా నవ్వాడు

వానాకాలం చదువు బాబూ నాది నా చిన్నతనంలో వేలాది 'రూపాయలు ఖరీదు చేసే తడిపొలాలు కలిగిన ఆసామీ మా నాన్న కానీ ఆయన ఊర్లు తిరగడానికీ త్రాగుడుకూ అలవాటు పడిపోయి మొత్తం ఖాళీ చేసేశాడు దాంతో మా సంసారం వీదిన పడినట్లయి పోయింది బాబూ!

చదువుకోవాలని నేను ఎంత తాపత్రయపడ్డానో నాకొక్కడికే తెలుసు కానీ చదివించేవారే కరువయ్యారు నాకు అమ్మ దిగులుతో జబ్బున పడిపోయిన మనిషి నాన్న త్రాగుబోతు, తిరుగుబోతు" తో బుట్టుపులెవరూ లేనివాడ్ని"

నోట్సులు కుట్టుకోవడానికి డజను తెల్ల కాగితాలు దొరికేవి కావు పెన్సిలు కొనుక్కోవడానిక కాణీ ఉండేదికాదు అచ్చు పుస్తకాలు అసలుండవు స్కూలుకు ఎలాగో వెళ్లాలన్నా శుభ్రమైన దుస్తులు ఒక్క జత అయినా ఉండేవికావు

నిజం చెప్పాలంటే కడుపు నిండా తిండికీ, ఒంటి నిండా బట్టకీ, కంటి నిండా నిద్రకు నోచుకోని రోజులవి చివరికి ఆకలిని భరించలేక ప్రతిరోజూ బాగా చీకటిపడ్డాక నా జత పిల్లలు నన్ను గుర్తించకుండా ముసుగు కప్పుకొని వెళ్లి నాలుగు వీదులలో అన్నం అడుక్కు తెచ్చుకొని నేను కాస్త తిని, అమ్మకు కాస్త పెట్టి, మరునాటి ఉదయానికి కాస్త దాచుకొనేవాడ్ని ఆ పరిస్థితులలో ఉన్న నాకు చదువు ఒకటా?


నా జతగాళ్లందరూ ఒక్కో మెట్టే పైకెక్కి పోతుంటే కన్నీటితో వాళ్లకు మనసులోనే శుభాకాంక్షలతో వీడ్కోలు చెప్పుకొనేవాడిని సంవత్సరాలు గడచిపోయాయి అలా అలా!

నా గుండె ఎండిపోయి, నా మనసు బండబారి పోయి, నా కళ్లలో కన్నీరు ఇంకిపోయిన తరువాత చాల కాలానికి చిన్నతనంలో ఈ ఊర్లో నాతో పాటు చదివిన మురళీధర్ అనే మిత్రుడు ఈ ఆఫీసుకి గెజిటెడ్ ఆఫీసర్‌గా వచ్చాడు అతను ఈ ఊరు వచ్చిన మరునాడే నన్ను వెతుక్కుంటూ వచ్చాడు

అప్పటికి నేను ఓ కమ్మరి కొలిమిలో సమ్మెట బాదే ఉద్యోగం చేస్తున్నాను పొట్ట కూటి కోసం నా పరిస్థితి అంతా గ్రహించిన మురళీదర్ నాకు ధైర్యం చెప్పి తనే స్వయంగా ప్రయత్నం చేసి ఒక అటెండరు పోస్టు తెప్పించి నాకు ఇప్పించాడు తన పీరియడ్‌లోనే

అలా స్థిరపడ్డాను బాబూ ఈ ఉద్యోగంలో

నేను పడ్డ బాధలూ, ఆవేదనలూ, అశాంతీ నా పిల్లలు అనుభవించకూడదనే స్థిర నిశ్చయంతో నేను ప్రతి పైసాకీ విలువనిచ్చి కూడబెట్టటం



నేర్చుకొన్నాను అంతేకాదు పెంచి పెద్ద చేయడం కూడా నేర్చుకున్నాను

ఇంకో నాలుగు నెలల్లో నేను రిటైర్ అయిపోతాను కదా బాబూ? ఆ తరువాత నేనే పనీ చెయ్యనవసరం లేదు ఈ వడ్డీ వ్యాపారం కూడా మానేస్తాను' నా శేష జీవితం హాయిగా ప్రశాంతంగా గడచిపోతుంది

బాగా డబ్బుండాలి బాబూ' బాగా డబ్బుండాలి మనిషికి– డబ్బులేనినాడు ఎ సుఖమూ ఉండదు మనిషికి అంతేకాదు డబ్బులేని మనిషి ఎందుకూ పనికిరాడు ఈ లోకంలో

నేను డబ్బు సంపాదించుకుని ఉండకపోతే నా పిల్లలు ఇంత పైకి ఎగబడేవారా? ఈ రోజు కూడా నా తల్లి బాగా ఆరోగ్యంగా తిరుగుతోంది' ఎందుకో చెప్పనా బాబూ?' కేవలం డబ్బు మహిమ డబ్బు లేకుండా ఉండి వుంటే నా తల్లి ఎప్పుడో చచ్చిపోయి వుండేది అనారోగ్యంతో

డబ్బు చేర్చుకున్నవాన్ని కాబట్టి నా చివరి రోజులు ప్రశాంతంగా రామా' క్రిష్ణా'' అనుకొంటూ గడిపివేయగలను ఇదీ బాబూ నా కథ' అంటూ ముగించా డు మల్లయ్య

నేను అతని వైపు చూస్తూ కూర్చుండిపోయాను అతను వడ్డీ వ్యాపారం చేస్తాడని తెలిసినప్పుడు అతనిమీద తేలిక రకం అభిప్రాయం ఎర్పరచు కున్నందుకు సిగ్గుపడ్డాను కూడా

ఈ లోకంలో ఒక్కో వ్యక్తి గొప్పదనం ఒక్కో రకంగా ఉంటుంది

మల్లయ్య గొప్పవాడు నిజానికి'

* * * * * *

ఆ తరువాత కూడా ఒకటి రెండు నగలు అజ్ఞాత వాసంలోకి వెళ్లాయి

అటు తరువాత అనవసరంగా వడ్డీ ఎందుకండీ దండుగ? డబ్బున్నప్పుడు చేయించుకుందాం గానీ అమ్మి వేయండి అంటూ తరువాతవి ఒక్కటొక్కటే అందించడం మొదలుపెట్టింది సుగాత్రి చివరకి తాళిబొట్టు తో వున్న చైను తప్ప మరో బంగారం ముక్క లేకుండా పోయింది సుగాత్రి శరీరం మీద కమ్మలూ ముక్కుపుడకలూ కూడా ఇచ్చేసి పాస్టీవి పెట్టుకోసాగింది తను

నా చేతి వాచి ఉంగరం నా సైకిలు ఇంట్లోని ఫిలిప్స్ రేడియో టేపు రికార్డరు బట్టల బీరువా గ్రైండర్ కూడా అమ్మేశాను వరుసగా

అన్నీ అయిపోయిన తరువాత నా వాటా భూమి కూడా అమ్మేయాలనుకున్నాను కానీ నా పరిస్థితి తెలుసుకున్న మా ఆపీసరు మోటారు సైకిలు అడ్వాన్సు మ్యారేజి అడ్వాన్సు ఇలా ఆఫీసు ద్వారా ఇవ్వగలిగిన అప్పులు వరుసగా ఇప్పించి ఆదుకొని పల్లెలో తిండిగింజలు ఇస్తున్న భూమిని పోగొట్టుకోకుండా కాపాడాడు

నేను మా బామ్మను బ్రతికించుకోడానికి నా శాయశక్తులా ప్రయత్నిస్తూ తల్లక్రిందులయిపోతూ ఉంటే నా బంధువులలో స్నేహితులలో చివరకి మా ఆఫీసు స్టాఫులో కూడా చాలామంది నన్నో పనికిమాలినవాడి క్రింద జమకట్టి చులకనగా చూడ్డం మొదలుపెట్టారు

నేను వాళ్లెవరినుండీ ఎ ఆర్థిక సహాయమూ ఆశించకపోయినా కనీసం వారెవరికీ ఎలాంటి ఇబ్బందినీ కలిగించకపోయినా నన్ను అర్థవిహీనమైన ప్రశ్నలతో పనికిరాని మాటల ఈటెలతో గాయ పర్చడమూ చిన్న అవకాశం లభించినా అవమానించ డానికి ప్రయత్నించడమూ చెయ్యసాగారు

డార్విన్ థియరీని కళ్లకు కట్టినట్టు చూపిస్తున్న వాళ్లను చూసి నవ్వాలో ఎడవాలో బాదపడుతూ కూర్చోవాలో అర్థంకాక సతమతం అయిపోయే వాడిని ఎదురు దాడి చేసే ఓపిక లేక ఎంత ఆలోచించినా వాళ్ల సంస్కారరాహిత్యానికి కారణాలు అవగతం అయ్యేవికావు

చివరికి అన్నయ్యగారికీ తమ్ముళ్లకూ కూడా ఇదంతా విసుగ్గా తయారయినట్లుంది వయసు అయిపోయిన ముసలి వ్యక్తి కోసం ఇంత డబ్బు తగలెయ్యడం వృదా అనే బావన వాళ్లలో తలయెత్తి ఉండాలి నాతో డైరెక్టుగా ఎమీ అనకపోయినా వాళ్ల ముఖాపం చూసి నాకు అనుమానం వచ్చేసింది నా అనుమానం నిజమో కాదో ఆ బగవంతునికే తెలియాలి కానీ నేను చెయ్యగలిగింది మాత్రం ఏమిటి ఆ పరిస్థితులలో?


అయితే బగవంతుడు గొప్పవాడు' వాడి దయవల్ల నా పట్టుదల నెగ్గింది యమబటుల్ని వెనక్కి తరిమికొట్టి సంపూర్ణ ఆరోగ్యం పొంది నోరారా రామబజన చేస్తూ బామ్మ ఇంటికి తిరిగి రావడానికి తరువాత అట్టే రోజులు పట్టలేదు

(ముగింపు పై వారం,

## ఈ వేమన పద్యాలు




నీళ్లలోన నోడ నిగిడి తిన్నగ ప్రాకు
బైట మూరడైన ప్రాకలేదు
నెలవు దప్పు చోట నేర్పరి కొఱగాడు
విశ్వదాభిరామ వినురవేమ.



# వడ్డీ

**టి.యస్.ఏ.కృష్ణమూర్తి**

(గత సంచిక తరువాయి)

ఎంత అనుభవాలతో, ఎంత అవమానాలతో రోజులు గడువసాగాయి సుగాత్రి పేరంటాలకూ, ఫంక్షన్‌లకూ, పెళ్ళిళ్ళకూ .. చివరకి తమ పుట్టింటికి కూడా వెళ్ళడం మానుకుంది.

నా వదినా, మరదళ్ళు సైతం తనని చిన్న చూపు చూస్తున్నారని నేను గ్రహించగలిగాను ఇలాంటి విషయాలు గ్రహించడానికి పెద్ద తెలివి అనవసరం నిజానికి. ఎదుటి వ్యక్తి విషయంలో కాస్త మెత్తబడ్డా వానపాములు సైతం తలఎత్తి బుసలు కొట్టడం సహజం కాబోలు ఈ ప్రపంచంలో!

మనుషులు డబ్బుతో, బంగారంతో తప్ప విలువపొందలేరా? ఈ ప్రశ్న నన్ను ఆశ్చర్యసాగరంలో ముంచివేసేది. ఇదంతా నాకు క్రొత్తగా మింగుడు పడుతున్న వ్యవహారం ఎందుకంటే "పావర్టీ ఈజ్ నాట్ ఎ క్రైం .. జస్ట్ ఇట్ ఈజ్ ఎన్ ఇన్ కన్వీనియన్స్!" అని నమ్మిన మనిషిని నేను

అయితే వరండాలో కూర్చుని పాతకాలపు కళ్ళద్దాలలోంచి, చూస్తూ రామాయణాన్ని పారాయణం చేసే బామ్మను చూస్తోంటే మాత్రం నాకు చాల గర్వం కలిగేది సుగాత్రి మీద ప్రేమ పొంగిపొర్లేది. సుగాత్రిలాంటి శ్రీమతిని పొందినందుకు ఉప్పొంగి పోయేవాడ్ని సుగాత్రి నాకు తగ్గ భార్య అంతకుమించిన అదృష్టం ఏమిటి ఈ ప్రపంచంలో?

సంతృప్తిని మించిన సుఖం మరొకటిలేదు నిజానికి!

* * * * * *

ఆ రోజు నాకు బాగా జ్ఞాపకం ఉంది.

'ఏమిరా వూరు వెళ్ళడం లేదా?" అని అడిగింది బామ్మ కళ్ళద్దాలు తీసి చీర చెంగుతో తుడుచుకుంటూ

బామ్మ ప్రశ్న వినగానే గతుక్కుమన్నాను

ఆ మరునాడే నాకూ, సుగాత్రికీ పెళ్ళయిన రోజు. ప్రతి సంవత్సరం ఆనాడికి తప్పనిసరిగా సుగాత్రి వాళ్ళ ఊరు వెళ్ళడం పరిపాటి మాకు


"లేదు బామ్మా!" అన్నాను నీళ్ళు నములుతూ. అక్కడ ప్రస్తుతం మాకు లభిస్తోన్న గౌరవ మర్యాదలను గూర్చి ఎలా వివరించి చెప్పగలను బామ్మకి?

అయితే నేను చెప్పకపోయినా గ్రహించలేనంత అజ్ఞానికాదు బామ్మ. అందుకే నిముషంపాటు దీర్ఘంగా ఆలోచించింది.

"ఒరే అబ్బీ!! మనిషి సుఖంగా బ్రతకాలన్నా డబ్బు కావాలి, గౌరవంగా బ్రతకాలన్నా డబ్బు కావాలి, తనా, మనా అని లేకుండా ఎవరిచేత గౌరవింపబడాలన్నా డబ్బు కావాలి. నేటి ఈ వింత కాలంలో ప్రతిదానికి డబ్బే ప్రధానం అయిపోయింది అవునా?"

బామ్మ వేసిన పై ప్రశ్ననే కాస్త అటూ యిటూగా విడదీసి సలహాగా చెప్పాడు మల్లయ్య ఒకనాడు

"అవునే" అన్నాను ఏమనాలో తోచక ఆ ప్రశ్న బామ్మ కాక మరెవరు అడిగివున్నా చచ్చినా ఆ సమాధానం మాత్రం చెప్పేవాడ్ని కాను.



"నీవు తలచుకుంటే ఆ వెధవ డబ్బు సంపాదించలేక పోతావురా అబ్బీ?!"

ఎందుకో బామ్మ ప్రశ్న చెంప దెబ్బలా తగిలినా బామ్మకు నా తెలివితేటల మీదా, నా శక్తి మీదా ఉన్న నమ్మకానికి చాల గర్వపడ్డాను ఆ నిముషంలో.

తెలివున్న వాడికి డబ్బు సంపాదించడం అనేది పెద్ద కష్టమయిన పనికాదు నిజానికి.

డబ్బు ఎలా సంపాదిస్తే బావుంటుందా? అని ఆలోచించడం మొదలుపెట్టాను.

* * * * * *

మనది సర్వ స్వతంత్ర దేశం

ఈ దేశంలో చాలమంది మనుషులు అప్పులు చేస్తుంటారు. కొద్దిమంది మనుషులు అప్పులు ఇస్తుంటారు పెద్ద పెద్ద కంపెనీలూ, బ్యాంకులూ, సంస్థలూ, వ్యాపార సంస్థలూ.. చివరికి ప్రభుత్వానికి సంబంధించిన కొన్ని సంస్థలు కూడా అప్పులు చేస్తుంటాయి! మరికొన్ని ఋణాలు మంజూరు చేస్తుంటాయి!!

సూక్ష్మంగా ముక్కుకు సూటిగా చెప్పాలంటే అసంఖ్యాకులైన ఋణార్థులతో ఈ దేశం కిటకిటలాడుతోంది. ఋణదాతల సంఖ్య మాత్రం పరిమితమే నేటి కాలమాన పరిస్థితులను బట్టి చూస్తే ఈ దేశానికి ఋణదాతల అవసరం ఇంకా చాలా, చాల ఉంద నిజానికి

పెద్ద పెద్ద కంపెనీలనీ, బ్యాంకులనీ, సంస్థలనీ ప్రక్కన పెట్టేస్తే నా పరిధిలో నేను చూసిందీ, నేను ఆలోచించి తెలుసుకొన్నదీ ఏమిటంటే

కొందరు కాగితాలు వ్రాయించుకొని, ఎక్కువ వడ్డీతో అప్పులు ఇస్తారు ఇలా కాగితాల మీద అప్పులివ్వడం రిస్కుతో కూడుకున్న పని ఇబ్బందులు కూడా ఎదురవవచ్చు కాబట్టి వడ్డీ రేటు కూడా అధికంగానే ఉంటుంది

మరికొందరు ఇండ్లస్థలాలు, ఇండ్లు, పొలాలు మొదలైనవి తాకట్టు పెట్టుకొని కాస్త తక్కువ వడ్డీతో అప్పులు ఇస్తారు ఇలాంటి తాకట్టు వ్యవహారాలలో కూడా కొన్ని ఇబ్బందులు లేకపోలేదు అయినా రిస్కు కాస్త తక్కువ కాబట్టి వడ్డీ రేటు కూడా మధ్యమంగా ఉంటుంది

ఇంకా కొందరు (నిజానికి చాలమంది) బంగారం లాంటి విలువైన వస్తువులమీద తక్కువ వడ్డీతో అప్పులు ఇస్తారు. ఇందులో పెద్దగా ఇబ్బందులంటూ ఉండవు రిస్కు చాల తక్కువ కాబట్టి వడ్డీ రేటు కూడా చాల తక్కువగా ఉంటుంది.

అయితే బంగారం మీదా, విలువైన వస్తువుల మీదా కూడా ప్రతి ఒక్కరికి ఋణాలు లభించవు నిజానికి ఋణం తీసుకొనే వ్యక్తి నమ్మకస్తుడయి

ఉండాలి తప్పకుండా లేని పక్షంలో ఆ వస్తువులు ఏ దొంగతనానికో, దోపిడీకో సంబంధించినవైతే అప్పు ఇచ్చినవాడు ఖచ్చితంగా ఇబ్బందులపాలు అవాల్సి వస్తుంది అనవసరంగా

అందుకే నమ్మకస్తులకు మాత్రమే ఋణ సౌకర్యం సునాయాసంగా లభ్యమవుతుంది ఎక్కడైనా!

★ ★ ★ ★ ★ ★

ఈ సువిశాల దేశంలో ఓ మూల నున్న ఓ చిన్న ఊర్లోని ఓ చిన్న ఋణదాత . అటెండరు మల్లయ్య రిటైరు అయిపోవడం, ఆ వెంటనే తన వ్యాపారాన్ని పూర్తిగా మానివెయ్యడం జరగడంతో మా ఆఫీసులో కొద్దిమంది, బయటవారు చాలమంది కొన్ని ఇబ్బందులను ఎదుర్కోవలసి వచ్చింది

★ ★ ★ ★ ★ ★

"సుగాత్రీ ఈవాళ శుక్రవారం నీవు ఇవ్వవని తెలుసుకానీ రేపు ఉదయాన్నే వసువుతాడుకు తాళీ, కన్యాదానం బొట్టూ మొదలైనవన్నీ తగిలించి కట్టుకుని నీ మెడలోని బొట్టు చైను తీసి నాకివ్వు!' అన్నాను

సుగాత్రి నాకేసి ఆశ్చర్యంగా, పరిశీలనగా చూసింది ఓ నిముషం

"ఎంత కావాలో చెప్పండి యశోదమ్మ పిన్నిగారి వద్ద తాకట్టు పెట్టి డబ్బు పట్టుకొస్తాను బొట్టు చైను అమ్ముకోవడం అరిష్టదాయకం అంటారు పెద్దవాళ్ళు!" అంది నెమ్మదిగా

"అలాగ! అయితే అమ్మివేయనుగానీ, నిరుపారాయులాగా కన్పించే ఆ పిన్నిగారి వద్ద తాకట్టు పెట్టడం వద్దు! వడ్డీ చాల ఎక్కువ ఆమె వద్ద!! వకీలు రామనాథయ్యర్ గారి గుమాస్తా లేదూ ప్రక్క వీధిలో అతనే నార పీచులా ఉండే నాంచారయ్య తను మా దూరపు బంధువు కూడాలే . బంగారం మీదనయితే నూటికి నెలకు రూపాయిన్నర వడ్డీతోటి అప్పులు ఇస్తాడని తెలిసింది ఈ ఊర్లో ధర్మ వడ్డీ పుచ్చుకొనే ధర్మాత్ముడు అతనే కాబోలు అతని వద్దే తాకట్టు పెట్టి తెచ్చుకుంటాను నాలుగువేల రూపాయలు! అన్నాను


'నాలుగువేల రూపాయలా? ఇప్పుడేమంత అవసరం?'

"చెప్పను!! మై సుగాత్రీ, చెప్పను గాక చెప్పను అనేశాను ఖచ్చితంగా

సుగాత్రికి చదువూ, సంస్కారమూ ఉన్నాయి అందుకే అడ్డదిడ్డమయిన ప్రశ్నలూ వేయలేదు ఆ తరువాత మరునాటి ఉదయాన్నే వసువుతాడుకు తాలి వగైరాలు తగిలించి కట్టుకుని బొట్టు చైను నా చేతులలో పెట్టింది

★ ★ ★ ★ ★ ★

పల్లెలోని నా వాటా భూమిమీద టూ పర్సెంటు ఇంట్రస్టుతో అరువేల రూపాయలు అప్పు తీసుకున్నాను నేను పల్లెలోనే బాగా డబ్బున్న ఓ పెద్దమనిషి వద్ద.



ఇబ్బందులంటూ లేనప్పుడు భూమిమీద ఎందుకు అప్పు తీసుకుంటున్నానో తెలియక రకరకాల అలోచనలతో తల్లడిల్లిపోయారు నాకు అనుకూల శత్రువులలాంటి బంధు జనులు కొందరు.

★ ★ ★ ★ ★ ★

మా ఆఫీసులో పనిచేస్తున్న వారిలో డబ్బు అవసరాలలో ఉన్న నమ్మకస్తుల వద్ద మా నాన్నగారి పేరిట కాగితాలు వ్రాయించుకొని వారికి నూటికి పదిన్నర రూపాయల వడ్డీతో అప్పులు ఇవ్వడం మొదలుపెట్టాను. అలా నేను మల్లయ్య ఖాళీచేసిన స్థానంలో కాలుమోపాను. తరువాత తరువాత నాకు నమ్మకస్తులనిపించినవారు, సిఫార్సు చేసిన వాళ్ళకు కూడా ఋణ సౌకర్యం అందించసాగాను

నాకు రావలసిన వడ్డీ డబ్బులు వసూలు చెయ్యడానికి మల్లయ్య రిటైరు అయిన తరువాత అతని బదులుగా ఆ ఖాళీలో చేరిన కుర్ర అటెండరు ఆంజనేయులును కమీషన్ పద్ధతి మీద కుదుర్చుకున్నాను నాకు వచ్చే పదిన్నర పర్సెంటు నేను తీసుకొని అర పర్సెంటు తాలూకు డబ్బు అతనికి ఇవ్వసాగాను

నాకు లభించే వడ్డీలో ఓ పది పైసలు కూడా నా స్వంతానికి వాడకుండా వచ్చిన డబ్బును వచ్చినట్లే అవసరంలో ఉన్నవాళ్ళకు అప్పుగా ఇచ్చెయ్యడం అలవరచుకున్నాను సక్రమంగా వడ్డీ చెల్లించని వాళ్ళకూ, మాట పోగొట్టుకున్న వాళ్ళకూ తదుపరి ఎట్టి పరిస్థితులలోనూ అప్పు ఇవ్వకుండా జాగ్రత్త పడసాగాను

వెండి బంగారాల మీదనయితే నమ్మకస్తులకు నూటికి నాలుగు రూపాయల వడ్డీతోటే అప్పులివ్వడం మొదలుపెట్టాను ఇందులో మాత్రం చాల మంచి లాభం ఉంది నా వద్ద డబ్బు వున్నా, లేకపోయినా కూడా వాటి మీద వారికి వెంటనే సులభంగా డబ్బు ఇవ్వవచ్చు

ఉదాహరణకి నమ్మకస్తులెవరైనా ఓ బంగారు నగో లేక వెండి పాత్రో తీసుకువచ్చి ఇచ్చి దానిమీద ఏ రెండువేల రూపాయలో కావాలంటే నా వద్ద డబ్బు లేకపోయినా కూడా ఇంటికి వెళ్ళి డబ్బు తెచ్చి ఇస్తాను" అని చెప్పి నేరుగా నాంచారయ్య వద్దకు వెళ్ళి అదే వస్తువును అతని వద్ద ఉంచి రపాయిన్నర వడ్డీ రేటుతో మూడువేల రూపాయలు తీసుకొని ఆ వస్తువు తెచ్చిన వ్యక్తికి నాలుగు రూపాయల వడ్డీతో రెండువేలు ఇచ్చి తక్కిన వెయ్యీ పదిన్నర రూపాయల రేటుతో అవసరార్థులకు ఇవ్వవచ్చు భగవంతుడి దయవలన ఋణార్థులకు ఎప్పుడూ లోటుండదు ఈ దేశంలో! ఎటొచ్చీ ఋణదాతలకు శక్తి ఉండాలంతే!

ఆ వస్తువును తెచ్చి తాకట్టు పెట్టిన వ్యక్తి తిరిగి ఆ వస్తువుకు లిబరేషన్ కలిగించేవరకూ కూడా ఈ వెయ్యీ టర్నోవర్ అవుతుంది. ఆ రెండు వేలకూ కమీషను లభిస్తుంది ఒక్క దెబ్బకు రెండు పిట్టలు రాలిపడడమన్న మాట!

ప్రతి రోజూ ఆఫీసు అయిపోయాక ఓ అరగంట కూర్చుని అనాటి వివరాలన్నీ నేను చెపుతూంటే ఆంజనేయులు ఓ చిన్న పుస్తకంలో వివరంగా వ్రాసుకుంటాడు అప్పై వసూళ్ల భారం అంతా అతనిదే! ఏమాటకామాటే చెప్పుకోవాలి ఆంజనేయులు సిన్సియర్ అండ్ హానెస్టు పర్సన్! అసిస్టెంటు మంచివాడు లభించడం కూడా అదృష్టమే మరి!

నా మానాన నేను ఉద్యోగం చేసుకొని సంసారాన్ని లాగుతూ పార్టు టైం బిజినెస్‌గా పదివేల రూపాయలతో ప్రారంభించిన వడ్డీ వ్యాపారాన్ని గూర్చి సుగాత్రికి ఏమాత్రం తెలియనివ్వలేదు ఎందువల్ల అంటే సుగాత్రి అత్యధికంగా అసహ్యించుకొనేది వడ్డీ వ్యాపారాన్నే!

★ ★ ★ ★ ★ ★

ఈ రోజు నాటిన మొక్కలు ఈ రోజే ఫలాల నందివ్వవు కాలం కదలాలి మొక్కలు మానులయిన తరువాతే తియ్యని ఫలాల నందిస్తాయి

మొక్కలు మానులయ్యేలోపూ, అయిన తరువాతా ఒకటీ, అరా పళ్ళు రాలిపోయినా, కొద్ది గొప్పో పళ్ళను పక్షులు కొట్టి పాడు చేసినా కూడా కాపు చేతికి అందకుండా ఎక్కడికీ వెళ్ళదు

అలాగే లాభం కొరకు చేసే వ్యాపారంలో అక్కడక్కడా అప్పుడప్పుడూ కాస్త నష్టం కలిగినా జాగ్రత్తగా ముందుకు అడుగులేసే వ్యాపారికి గొప్ప లాభాలు అందకుండా పోవు

* * * * * *

ప్రస్తుతం నావద్ద బాగా డబ్బుంది

ఇతరుల వస్తువుల మీద డబ్బుకోసం నాంచారయ్య వద్దకు పరిగెత్తే స్థితిని దాటి చాల పైకి వచ్చేశాను ఎవరైనా డబ్బుకోసం వచ్చినా, బంగారం, వెండి ఏదయినా తెచ్చినా కాగితం వ్రాయించుకొని వాళ్ళకు నాన్నగారి సంతకం ఉన్న చెక్ ఫిలప్ చేసి ఇచ్చేస్తాను వాళ్ళు దాన్ని బ్యాంకులో క్యాష్ చేసుకుంటారు సాయంకాలము ఆ విషయం అంజనేయులు తన అక్కవుంట్ బుక్సులో కోడ్‌లో వ్రాసుకొంటాడు

ప్రస్తుతం అంజనేయులుకు నేను ప్రత్యేకంగా మంచి జీతం ఇస్తున్నాను

నేను సంపాదిస్తున్నదంతా నేనే దాచుకోవడం కూడా లేదు ఆకలితో ఎవడు తారసపడినా వాడికి అన్నం పెట్టిస్తున్నాను అభాగ్యులైన వారికెందరికో వీలయినంత వరకూ ఆర్థిక సహాయాలు చేస్తున్నాను పేదపిల్లల స్కూలు ఫీజులు చెల్లిస్తున్నాను పేదరికంలో మగ్గిపోతున్న జబ్బు మనుషులు చేయి జాచి అడిగితే వంద రూపాయలకు తక్కువకాకుండా ఇవ్వగలుగుతున్నాను

## వడ్డీ

సుగాత్రికి ప్రస్తుతం మంచి నగలు చాలా ఉన్నాయి ఆమెను బలవంతంగా అయినాసరే పెళ్ళిళ్ళకూ, పేరంటాలకూ, లొక్కువెళ్ళే వాళ్ళకూ తక్కువలేదు (ఫంక్షన్‌లలో కన్పించే ఖరీదయిన దుస్తులూ, నగలూ ధరించిన స్త్రీలు ఫంక్షన్ ధారుల స్టేటస్ సింబల్స్ కాదో లు?!)

బంధువులూ, మిత్రులూ, అయినవాళ్ళూ, కాని వాళ్ళూ ఎందరో మమ్మల్ని గౌరవిస్తున్నారు

అనాడు నావద్ద లేనిదీ, ఈనాడు నావద్ద ఉన్నదీ ఒక్కటే! డబ్బు!! , ఈ దేశంలో దీనికున్నంత విలువ మరి దేనికీ లేదనిపిస్తుంది నిజంగా

ఇతర దేశాల సంగతి నాకు తెలియదాయె!

* * * * * *

దేశంలో ని పెద్ద పెద్ద దేవుళ్ళందరినీ చూసి రమ్మని బామ్మను తీర్థయాత్రలకు పంపించి వారం రోజులు కూడా కాలేదు అంతమంది దేవుళ్ళలో ఏ ఒక్క దేముడికి నామీద దయవుండి ఉన్నా, కనీసం కృతజ్ఞత ఉండి ఉన్నా ఇలా జరిగేదికాదు

గుట్టుగా మూడు పువ్వులు, ఆరుకాయలుగా సాగుతున్న నా వడ్డీ వ్యాపారాన్ని గూర్చి సుగాత్రికి విపులంగా తెలియజేసిన దుర్మార్గులనూ (లేక దుర్మార్గు రాళ్ళను) దేముళ్ళనూ కూడా తిట్టుకుంటూ రైలు దిగాను

అత్మతగా బయల్దేరడంలో టార్చి మర్చిపోయి రావడంవల్ల రైల్వేస్టేషను నుండి మైలు దూరంలో వున్న మా అత్తగారి పల్లెటూరిని చేరుకోడానికి గంటకు పైగానే పట్టింది కటిక చీకటిలో దారి సరిగ్గా కన్పించకపోవడం వల్ల

అంత రాత్రి వేళలో పడుతూ, లేస్తూ వచ్చేసిన నన్ను చూడగానే నామీద వచ్చిన కోపం చాలావరకూ తగ్గిపోయిందేమో? కొద్దిగా నవ్వి మంచిగానే నన్ను రిసీవ్ చేసుకుంది సుగాత్రి

* * * * * *

సుగాత్రి అలా చెరువు కట్టమీదుగా మార్నింగ్ వాక్ వెళ్ళి వద్దామా? అని ప్రేమగా అడిగాను

నాకే గాదు సుగాత్రికి కూడా ఆ చెరువు కట్టమీద నుండి ఉదయాస్తమయాలలో కనిపించే ప్రకృతి దృశ్యాలంటే ప్రాణం అందుకే మారు మాట్లాడకుండా చెప్పులు తొడుక్కొని బయల్దేరింది తను

పది నిముషాలలో చెరువు కట్టమీదికి చేరుకున్నాము

చెరువులో ఒంటి కాలిమీద నిలబడి కొన్ని, రెండు కాళ్ళ మీద నిలబడి కొన్ని కొంగలు నీరెండకు చలి కాపుకొంటూ ఆహారం సంపాదించుకునే ప్రయత్నాలలో ఉన్నాయి చెరువు మధ్యలో దిగడానికి చెరువు మీదుగా ఆకాశంలో తిరుగుతున్నాయి ఎక్కడ్నుంచో వచ్చిన చెరువు కోళ్ళు కొన్ని

చెరువు వెనుకగా దూరంగా గుట్టలు, వాటి వెనుకగా నీలికొండలు కొండలమీద మబ్బు




నూతన యవ్వనం పొందండి! సంతానవంతులు కండి. చర్మ వ్యాధులనుండి విముక్తులు కండి. హస్త ప్రయోగమువలన కలుగు నరముల బలహీనత, శీఘ్ర స్కలనము, అంగము చిన్నదగుట, అవసర కాలమందు అసంతృప్తి, సంతానము లేక పోవుట, సమస్త చర్మవ్యాధులకు ఆయుర్వేద చికిత్స! పోస్టు ద్వారా చికిత్స కలదు.

"క్యాంపులు" : ప్రతి ఆదివారం 'భీమవరం' షణ్ముఖ లాడ్జిలో ఉదయం 8 గం. నుండి సాయంత్రం 6–30 గం వరకు. ప్రతి నెల 1 మరియు 16 తేదీలలో 'రాజమండ్రి' హోటల్ అశోకాలో కోటగుమ్మం దగ్గర మధ్యాహ్నం 12 గం. నుండి రాత్రి 9 గం. వరకు.

డా॥ డి. మార్కండేయులు

ఆయుర్వేద భిషక్, సెక్స్ & స్కిన్ స్పెషలిస్ట్,

పార్కురోడ్, గుడివాడ - 521301

ఫోన్స్ : 522 & 540



LOANS LOANS LOANS LOANS LOANS LOANS

# LOANS

LOANS LOANS LOANS LOANS LOANS LOANS





AVAILABLE LOANS EVEN WITHOUT MORTGAGE / PLEDGE / GUARANTORS. FOR LOAN FORMS AND GUIDANCE-BOOKLET, REMIT Rs. 100/- BY M.O. / I.P.O. / D.D. TO :



Satna Syndicate Banker

SATNA—485001 (M.P.)

NOTE—Deposits shall not be accepted.

తునకల మధ్యన ఎంత సోయగాలు వెదజల్లుతున్న బాలభానుడు . చాల సుందరమయిన దృశ్యం, ఆహ్లాదకరమయిన వాతావరణం

చెరువు క్రిందనున్న పచ్చటి పొలాల మీద నుండి వస్తున్న చల్లని గాలిలో నెమ్మదిగా నడుస్తూ నిదానంగా మాట్లాడటం మొదలుపెట్టాను

"మై డియర్ సుగాత్రీ, ఈ దేశంలో అప్పులు తీసుకొనే మనుషుల మీద తక్కువ అంటే ఒద్దున వున్న మనుషులు సానుభూతి చూపుతారు, జాలిపడ్తారు కూడా! అదే మనుషులు అప్పులు ఇచ్చేవాళ్ళని గూర్చి మాత్రం క్రూరంగా ఆలోచిస్తారు "ఈ వడ్డీ తినే వెధవలకి కుష్ఠు రోగాలు వస్తాయి!' అని తిట్టడం కూడా కద్దు నిజమే కానీ ఇక్కడ ఒక ముఖ్య విషయం గ్రహించరే చాలమంది?


అవసరంలో ఉన్నవాడికి కావలసింది ఏడికెడు సానుభూతి, దోసెడు జాలీ, కడివెడు కన్నీరూ కాదు వాడికి కావల్సింది అవసరం తీరడం! సానుభూతి చూపే వారివల్ల అవసరం తీరుతుందా? ఎక్కువగా తీరదు సామాన్యంగా అతని అవసరం తీరుతున్నది వడ్డీ వ్యాపారి వలననే!

వడ్డీ పుచ్చుకున్నా అతను ఇతన్ని ఆదుకొంటున్నాడు ఈ విషయాన్ని గ్రహించగలిగేవాళ్ళు అరుదు గ్రహించిన వాళ్ళు వడ్డీ వ్యాపారిని అసహ్యించుకోరు సుగాత్రీ! నీవు ఎక్సయిట్ అయిపోకుండా కాస్త సావధానంగా ఆలోచించి చూడు నీకే అర్థం అవుతుంది నా మాటలలోని నిజం'

"మీరెన్నయినా చెప్పండి కానీ నాకు ఆ వడ్డీ వ్యాపారం అంటేనే కంపరం మీరు ఆ వ్యాపారం చేసి డబ్బు సంపాదిస్తున్నారని తెల్సినప్పట్నుంచీ నాకు పిచ్చిపట్టినట్టుంది అసలు ఈ పాడు వడ్డీ వ్యాపారం అనేది ఈ దేశంలోనే లేకుండా పోతే బావుండుననిపిస్తోంది!" అంది సుగాత్రి

"చాల మంచి ఆలోచన! కానీ సుగాత్రీ, అసలు వడ్డీ వ్యాపారం అనేదే ఈ దేశంలోంచి కనుమరుగై పోవాలంటే దేశంలో చాల, చాల మార్పులు రావాలి ఉదాహరణకి కొన్ని మార్పులు చెపుతాను

రైళ్ళలో ఎ సి , ఫస్టుక్లాస్, సెకెండ్ క్లాసు అన్నీ పోయి అన్ని పెట్టెలలో ఒకే రకం సౌకర్యాలు, ఒకే రకమయిన రేట్లు రావాలి ప్రతి మనిషి సునాయాసంగా, హాయిగా ప్రయాణం చెయ్యగలిగిన పరిస్థితులు కల్పించబడాలి ఆర్థికపరంగానూ సాంకేతికపరంగానూ కూడా!! సినిమాహాళ్ళలో కూడా క్లాసులు పోయి బాల్కనీలలో, క్రిందా మొత్తం అన్నీ ఒకే రకమయిన సీట్లు ఏర్పరచబడి ఒకే రేటుతో అందరికీ ప్రవేశం కల్పించబడాలి ముందుగా వచ్చినవాడు బాల్కనీలో కూర్చుంటాడు కాస్త ఆలస్యంగా వచ్చినవాడు క్రింద చివరగా కూర్చుంటాడు బాగా ఆలస్యంగా వచ్చినవాడు తెర దగ్గరగా కూర్చుంటాడు అంతేకాదు ఇంకో అతి ముఖ్యమయిన మార్పుకూడా రావాలి అదేమిటో తెలుసా?




రంభ నవ్వింది, మేనక ఏడ్చింది, తిలోత్తమ డాన్సాడింది, ఊర్వశి నీళ్ళాడింది లాంటి సినిమాలు ఒక్కో హాలులో ఆరు లేక ఏడు ఆటలు ప్రదర్శింపబడకూడదు రోజుకు ఒక్కో థియేటరులో ఒక్క షో మాత్రమే ప్రదర్శింప బడాలి అదయినా తప్పనిసరిగా ఉత్తమ చిత్రమే అయివుండాలి ప్రొడక్టివ్ వర్కు అనే గొప్ప ఆనకట్టకు పడివున్న గండిని పూడ్చే ప్రయత్నాలలో ఓ చిన్న ప్రయత్నం అన్నమాట ఇది

ముఖ్యమంత్రి ఇళ్ళు, స్పెషల్ ఇళ్ళల స్థాయి నుండి హోటళ్ళు ఎదగాలి అసలు తీరుబాటుగా హోటళ్ళమీదపడి తింటూ త్రాగుతూ, కబుర్లు చెప్పుకుంటూ కూర్చునే వ్యవధి మనుషులకు ఉండరాదు సమయం విలువ ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి.

లక్షలు, కోట్లు ఖర్చు చేస్తూ టి వీ లలో, రేడియోలలో, సినీమాలలో, వార్తాపత్రికలలో, కన్పించిన పెద్ద పెద్ద గోడలమీదా వ్యాపార ప్రకటనలను ఇస్తూ ఉండిపోవడం కాకుండా పారిశ్రామిక వేత్తలు తమ ఉత్పాదక వస్తువుల స్థాయినీ, ఉత్పాదక వస్తువుల నాణ్యతలనూ పెంపొందించుతూ ధరలను కూడా బాగా తగ్గించి ఇవ్వగల ఎబిలిటీని సంపాదించుకోవాలి

సమర్థులు చప్రాసీలు గానూ, అసమర్థులు నాయకులు గానూ ఎట్టి పరిస్థితులలోనూ కొనసాగరాదు

కొందరు ఎ. సి. గదులలో ఆనందాలు అనుభవిస్తుండగా కొందరు పందులతో సమానంగా బ్రిడ్జిల క్రిందా, గోడ్డాల మధ్యనా, చెట్లక్రిందా కాలం గడపరాదు.

స్కూలుకు వెళ్ళాల్సిన వయసులోని లేత పసిపిల్లలు ఎందరో డాల్డా డబ్బాలను లేదా మట్టి పాత్రలను చేత పట్టుకుని, "అమ్మా! అంత అన్నం పెట్టు తల్లీ!.. మాతా కవలం!" అంటూ దీనంగా రోడ్లు పట్టుకుని ఎండనకా, వాననకా భిక్షాటనలు చెయ్యడం పోయి మెరుస్తున్న కళ్ళతో ప్రతి చిరంజీవి ఎదగగలగాలి

తల్లి దండ్రులకు టాటా చెప్పాల్సిన ఎన్నో లేత చేతులు చెత్త డబ్బాలలో, మురికి కాలువలలో కంపుకొట్టే ప్రదేశాలలో గాజు ముక్కలూ, ఇనుప రేకులూ, కాగితాలూ ఏరి ప్రోగు చేసుకునే దుస్థితి శాశ్వతంగా తుడిచిపెట్టుకు పోవాలి

గొప్పవాళ్ళూ, మధ్య తరగతి వాళ్ళూ, పేదవాళ్ళూ అనే తేడాలన్నీ పోయి మనుషులంతా ఒక్కటి అయిన నాడు, ముఖ్యంగా క్యాన్సరు లాంటి భయంకరమైన జబ్బైనా సరే ఎవరికి వచ్చినా వైద్య సదుపాయం సునాయాసంగా పొందగలిగిన నాడు వడ్డీ వ్యాపారులు ఉండరు ఈ దేశంలో

అంత గొప్పదనం మన దేశంలో లేదు, ఇప్పట్లో రాదు. కాబట్టి ఈ దేశంలో వడ్డీ వ్యాపారులుండాల్సిందే! వడ్డీ వ్యాపారు లందరికీ కుష్ఠు వ్యాధులు వచ్చి అప్పులివ్వడానికి వాళ్ళకు చేతి వ్రేళ్ళు లేకుండా పోతే నిజంగా నష్టపోయేది అరకడుపుల వాళ్ళే! ఆపై వాళ్ళ అవసరాలకు ఆదుకునే వారెవరు?

నేటి పరిస్థితులను బట్టి ఆలోచించి చూస్తే వడ్డీ వ్యాపారి గొప్ప సమాజ సేవకుడు నిజానికి కాస్త ఆవేశం తగ్గించుకుని నెమ్మదిగా ఆలోచించి చూడు . నిజం నీకే బోధపడుతుంది!'

అంటూ ఊపిరి తీసుకోవడానికి ఆగిపోయాను అయితే చాల ఎక్సైటుమెంటుతో నేను ఇచ్చిన సుదీర్ఘమైన ఉపన్యాసం సత్ఫలితాన్ని ఇవ్వలేదు నిజానికి. ఎక్సైటెడ్‌గానే ఎదురు దాడి ప్రారంభించింది సుగాత్రి కూడా

ఆగండి ఆగండి! ఈ దేశంలోని వడ్డీ వ్యాపారు లందరూ మీరన్నట్టు సమాజ సేవకులు కారు. నూటికి ఏ ఒక్కరో, ఇద్దరో న్యాయంగా వడ్డీ వ్యాపారం చేస్తున్నారేమో? కానీ తక్కిన వాళ్ళందరూ జలగలలాగా పేద ప్రజలను పీల్చి పిప్పి చేస్తున్న వాళ్ళే

ఎదుటి మనిషి అవసరాన్ని బట్టి వడ్డీ రేటు పెంచేవాళ్ళూ, ఒక్కసారి తమ చేతులలో చిక్కుకున్న వాళ్ళని శాశ్వతంగా తమ కబంధ హస్తాల మధ్య ఇరికించుకునే వాళ్ళూ, వడ్డీకి వడ్డీ కలుపుతూ ఋణగ్రస్తుడు సర్వం కోల్పోయేంత వరకూ వదిలిపెట్టని వాళ్ళూ ఇలా ఎన్నోరకాల వడ్డీ వ్యాపారస్తులను గూర్చి నాకు బాగా తెలుసు.

అలాంటి వారిలో మీరూ ఒకరుగా ఉండ్డడం నాకు సుతరామూ ఇష్టం లేదు మీరు నిజాయితీగా వడ్డీ వ్యాపారం చెయ్యడం అంటే ఏమిటో తెలుసా? తాటి చెట్టు నీడన కూర్చుని పాలు త్రాగడమే!

మీకు ఓపిక ఉంటే వెళ్ళి ఈ ఊర్లోనే శివాలయం ప్రక్కన పూరిగుడిసెలో వున్న సుబ్బయ్య తాతను అడగండి వడ్డీ వ్యాపారులలోని రకరకాల మనస్తత్వాలనీ, వారి విధానాలనీ గూర్చి వివరంగా తెలుపుతాడు మీకు

నా చిన్నతనంలో ఆయన నలభై ఎకరాల మాడిపొలానికీ, పదిహేను ఎకరాల తడిపొలానికీ అదిపతి అంటే మీరు నమ్మలేక పోవచ్చు నేడు పేడ ప్రోగు చేసి పిడకలు తడ్తున్న ఆయన బార్య జానకమ్మ చేతులు ఒకప్పుడు రోజుకు పాతిక మందికి తక్కువ కాకుండా బోజనం వడ్డించిన చల్లని చేతులంటే కూడా మీకు ఆశ్చర్యం కలుగవచ్చు కానీ నిజం

ఇంకో బయంకరమైన నిజం ఏమిటో తెలుసా? మేడలోని వాళ్ళు వీధిలో శివాలయం ప్రక్కని గుడిసెలో పడడానికి కారణం ఎవరో తెలుసా? వడ్డీ వ్యాపారులు!

మీరు చెప్పినది ఏది ఒప్పుకున్నా మీరు వడ్డీ వ్యాపారం చెయ్యడాన్ని మాత్రం నేను ఒప్పుకోనుగాక ఒప్పుకోను మీకు వచ్చే జీతంతో, మనకు పండే తిండిగింజలతో మనం హాయిగా, మహారాజులలా బ్రతకగలం కాబట్టి ఇక ఆ వ్యాపారానికి పెట్టండో నమస్కారం!

అనేసింది సుగాత్రి ఖచ్చితంగా, కాస్త ఆవేశంగా!

కూల్‌డౌన్ సుగాత్రీ కూల్‌డౌన్ ఇక్కడ నీకు ఇంకో ముఖ్యమైన విషయం చెప్పాలి నేను ఈ వ్యాపారంలో సంపాదించేదంతా మనకోసం మాత్రమే దాచడం లేదు నిజానికి నా చేతనైనంత వరకూ సంఘసేవ కూడా చేస్తున్నాను చెట్ల క్రింద

# సచ్చిదానందమ్

మనిషి
మొదట సత్తూ
ఆ తర్వాత చిత్తూ
అయితే
లబించే ఆనందమ్

—ఆర్ నరసింహారావు

# వడ్డీ

జీవించే వాళ్ళకూ, మురికి కాల్వల తాలూకు గొట్టాలలో నివసించే వాళ్ళకూ, బ్రిడ్జీల క్రింద జీవించే వాళ్ళకూ ఇలాంటి పేదవాళ్ళ కెందరికో ఎన్నో రకాలుగా ఆర్థిక సహాయం అందిస్తున్నాను ఈ వ్యాపారమే మానివేసిన నాడు నేను ఏ పేదవాడికీ ఎలాంటి సహాయమూ చేయలేను ఖచ్చితంగా

పోనీ మనిద్దరికీ సయోధ్య కుదిరేలా ఓ విషయం చెపుతాను విను ఈ దేశంలో పేదవాడూ-ధనికుడూ తేడా లేకుండా పోయిననాడు, అంటే నేషనల్ ఈక్వాలిటీ వచ్చేసిననాడు నేను ఈ వ్యాపారం మానేస్తాను అంతేకాదు ఆనాటికి నా వద్ద వున్న మొత్తం అంతా అణా పైసలతో సహా మొత్తం ప్రభుత్వానికి ఒప్పజెప్పేస్తాను! సరా? అంతదాకా మాత్రం నామానాన నన్ను ఈ వ్యాపారం చెయ్యనియ్యి!

స్వచ్ఛంగా నవ్విన సుగాత్రి వరిపొలాల్లో అక్కడక్కడ పనులు చేసుకుంటున్న మనుషులు చూస్తారని కూడా సంకోచించకుండా నా చెంపమీద మురిపెంగా ముద్దు పెట్టింది

అలాంటి రోజు మనం జీవించివుండగా రాదు ఈ దేశంలో మీరు నన్ను మూర్ఖురాలనుకోండి, మరేమయినా అనుకోండి లేదా నన్ను అసహ్యించుకోండి కానీ మీరు ఆ వ్యాపారం మాత్రం యికపై చెయ్యడానికి వీలులేదు అంతే! మీరు ఆ వ్యాపారం మానుకోకపోతే నాకు మనశ్శాంతి వుండదు మన పెళ్ళయిన తరువాత గడచిన యిన్ని సంవత్సరాలలోనూ నేను మిమ్మల్ని ఏ కోరికా కోరలేదు మన జీవితంలో నేను మిమ్మల్ని కోరుతున్న మొట్టమొదటి కోరిక ఇదే!

మీరు ఆ వ్యాపారాన్ని మానెయ్యండి!!

పిల్లలు యింకా టిఫిన్ తినలేదు నేను ఇంటికి వెళ్తున్నాను మీరు బాగా ఆలోచించుకొని ఒక నిర్ణయానికి వచ్చిన తరువాత ఇంటికి రండి మీ నిర్ణయం నాకు ఆనందాయకం అవుతుందనే ఆశతో నే వెళ్తున్నానని మరచిపోకండి!

అంటూ నా ఆలోచనలకు నన్ను చెరువు కట్టమీద వదిలేసి తను మాత్రం వెనక్కి తిరిగి పల్లెకేసి వడివడిగా నడచుకుంటూ వెళ్ళిపోయింది సుగాత్రి

దేనికీ లోటులేకుండా హాయిగా బ్రతుకుతున్నాను ఆకలితో ఎవరు ఎదురైనా పిడికెడు మెతుకులు పెట్టగలుగుతున్నాను కూడా! ఈ వ్యాపారం ఎలా మానివెయ్యడం?

నా ఊపిరిలో ఊపిరి నా ప్రాణంలో ప్రాణం సుగాత్రి ఏనాడూ యేదీ కోరని తను మొట్ట మొదటి పర్యాయం కోరిన కోరిక తీర్చకుండా ఎలా? ఎలా ఈ వ్యాపారం మానకుండా వుండడం?

చెరువు కట్టమీద వంటరిగా నిలబడిపోయి దూరంగా కన్పిస్తున్న రైలుకట్టవైపు బేలగా చూశాను

సిగ్నల్‌వద్ద గూడ్సు బండి ఒకటి ఆగిపోయివుంది సిగ్నల్ కోసం ఎదురుచూస్తూ చాలా చిన్నస్టేషను అది అవతల ఉన్నవి రెండే మార్గాలు ఒకటి డైరెక్టు లైను రెండవది టెంపరరీ డైవర్షన్ లైను

రెండు రెక్కలలో ఏ వైపు రెక్క వంగుతుందో? ఆ బండి స్టేషనులోకి ఏ మార్గంలో అడుగు పెడుతుందో ?

మొత్తానికి ఏదో ఒక మార్గంలోనే వెళుతుంది రెండు మార్గాలలోనూ వెళ్ళలేదు గనుక!!

(అయిపోయింది)

